# పర్యటకుల చేతిలోకి గోల్కొండ కోట చరిత్ర

## జీపీఎస్ వీడియో పరికరం ఆవిష్కరణ




ఆవిష్కరించిన ప్రత్యేక పరికరంతో పర్యాటక శాఖ అధికారులు

**గోల్కొండ:**గోల్కొండ కోటను వీక్షించే పర్యటకులకు వినూత్న అనుభూతిసొంతం కానుంది. పర్యటకశాఖ, మైఇండీఐ కంపెనీ ప్రవేశపెట్టిన 'జీపీఎస్ వీడియో టూర్ ఫర్ గోల్కొండ ఫోర్ట్' ద్వారా కోట, అందులోని ప్రముఖ నిర్మాణాల చరిత్రను ధ్వని, దృశ్య సహితంగా ఆస్వాదించవచ్చు. ఇందుకు ఉపకరించే సెల్‌ఫోన్ లాంటి టచ్‌స్క్రీన్ పరికరాన్ని కోటతో పాటు పర్యటకులు బసచేసే హోటళ్ల వద్ద అందుబాటులో ఉంచుతున్నామని పర్యటకశాఖ కార్యదర్శి జయేష్‌రంజన్ తెలిపారు. ఆదివారం కోటలో ఈ పరికరాన్ని ఆయన ఆవిష్కరించారు. దీనిని ఉపయోగించాలనుకున్నవారు రూ.500, రూ.300 అద్దెకు తీసుకోవాలి. కొనుగోలు చేసిన టిక్కెట్ వెనకాల ఉన్న బార్‌కోడ్‌తో పరికరంలో స్క్రాచ్ చేస్తే అది పనిచేయడం ప్రారంభిస్తుంది. కోటలోని నిర్మాణాల వద్దకు వెళ్లగానే వాటి దృశ్యాలు, దానికి సంబంధించిన చరిత్రను ఆంగ్లంలో వినిపిస్తుంది. ఈ పరికరం ఆదరణను చూసి కుతుబ్‌షాహీ టూంబ్స్, చౌమొహల్లాప్యాలెస్‌కు కూడా విస్తరిస్తామన్నారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యటక దినోత్సవాన్ని పురస్కరించుకుని హెరిటేజ్ కారిడార్ టూర్ కొత్త ప్యాకేజీని ప్రారంభిస్తున్నట్లు పర్యటకశాఖ అధికారులు తెలిపారు. ఈ టూర్‌లో ఏసీ బస్సు, గైడ్‌తో పాతబస్తీలో ఉండే 9 చారిత్రక నిర్మాణాలను చుట్టొచ్చన్నారు. పర్యటకశాఖ అదనపు కార్యదర్శి కాంతారావు, మైఇండీఐ సీఈవో కౌషల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.